ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



## జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు అరకు విద్యార్థులు

**ప్రజాశక్తి-అరకులోయ:** జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఏపి గిరిజన సంక్షేమ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ పిఎస్ఎన్ మూర్తి గురువారం తెలిపారు. ఈనెల 22న రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్‌లో జరగనున్న 43వ జాతీయ జూనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎస్‌జిఎఫ్ జాతీయ పోటీలకు ఎపిటిడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ఆర్.నాగేంద్రనాయక్, ఎస్ విజయ ప్రసాద్ ఎంపికయ్యారని తెలిపారు. ఆర్చరీ పోటీల్లో పాల్గొనే విద్యార్థులను శిక్షకులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ మూర్తి

## ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు!

**పెండింగ్‌లో ఉన్న 6,7,8 ఫారాలను క్లియర్ చేయండి**
**కంప్యూటర్ ఆపరేటర్‌పై ఆధారపడితే చర్యలు**
**తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**ప్రజాశక్తి-పాడేరు:** ఎన్నికల ప్రక్రియను సీరియస్‌గా తీసుకోవాలని, కంప్యూటర్ ఆపరేటర్ మీద ఆధారపడితే సహించేది లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న 6, 7,8 ఫారాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. 30 రోజులు దాటి పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆదేవిధంగా జీరో డోర్ నెంబర్లు, పిటిజి ఓటర్లు, ఒకే ఇంటిలో పది మందికన్నా ఎక్కువ ఉన్న ఓటర్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించి బూత్ లెవెల్ అధికారులకు పంపి విచారణ జరిపించి మూడు రోజుల్లో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డెత్ కేసులుంటే వాటిని తొలగించాలన్నారు. ఎన్నికల కమిషన్ ముందు ఎవరూ అతీతులు కాదని, సీరియస్ చర్యలు ఉంటాయని అందరూ ప్రొఫెషనల్‌గా వ్యవహరించాలని సూచించారు. రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ జె. శివశ్రీనివాసు మాట్లాడుతూ పలు రాజకీయ ప్రతినిధుల నుండి డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో తప్పులున్నాయని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో తహసీల్దార్లు సంబంధిత బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించి విచారణ జరిపించాలని ఆదేశించారు. ఇటీవల కలెక్టర్ చొరవతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 18 వేల పైగా పిటిజి ఓటర్లను నమోదు చేయటం జరిగిందని, ఇంకా మిగిలి ఉంటే నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించార. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యు అధికారి పి. అంబేద్కర్, మండలాల నుండి సబ్ కలెక్టర్లు వి. అభిషేక్, శుభం బన్సాల్, మండల తహసిల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## నేడు పాడేరులో 'జగనన్నకు చెబుదాం'

**ప్రజాశక్తి -పాడేరు:** ఈనెల 17వ తేదీ శుక్రవారం పాడేరులో జగనన్నకు చెబుదాం, ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభం అవుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణలో వైసిపి విఫలం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత చిన్నస్వామి

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ :** ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు కాపాడడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో సందర్శించిన సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులకు వందశాతం ఉద్యోగాలు కల్పిస్తూ గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో గిరిజనులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని, దాని పునరుద్ధరణలో వైసిపి ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. జిఒ3ను రద్దుచేసి నాలుగేళ్లగడిచినా, సుప్రీంకోర్టులో కనీస రివ్యూ పిటిషన్ దాఖలు చేయకపోవడం గిరిజనుల పట్ల వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం, చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు జిఒ3 పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం . తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో గిరిజనులు తగిన గుణపాఠం చెప్తారనిహెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ స్థానిక నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ జెడి ప్రతిభా భారతి

**ప్రజాశక్తి -పాడేరు :** గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు ఎస్. ప్రతిభాభారతి స్పష్టం చేసారు. గిరిజన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. గురువారం గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. విద్యార్థినులకు పాఠ్యాంశాలలోని ప్రశ్నలు వేసి జవాబులు చెప్పాలని కోరారు. ముందుగా పాఠ్యాంశాలను సాధన చేసి బోధించాలని ఉపాధ్యాయులుకు సూచించారు. ఆంగ్ల భాషపై ఆసక్తి కలిగే విధంగా విద్యార్థులకు బోధించాలన్నారు.. విద్యార్థులకు ఆదర్శంగా ఉపాధ్యాయులు నిలవాలని, పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.. పదవ తరగతిలో అందరు విద్యార్థులు పదికి పది గ్రేడ్ మార్కులు సాధించడమే లక్ష్యంగా విద్యాబోధన సాగించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై తగిన శ్రద్ధ పెట్టి విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలన్నారు. టెన్త్ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక బోధనపై ఆరా తీసారు. ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకోవాలని, గిరిజన సంక్షేమ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అటల్ టింకరింగ్ లాబ్‌ను సందర్శించారు. విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని సూచించారు. ప్రభుత్వ నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్. రజని పాల్గొన్నారు.

# పాలకుల నిర్లక్ష్యం వల్లే దుర్భిక్ష పరిస్థితులు

- కరువు బాధిత రైతులను పరామర్శించిన సిపిఎం నేతలు
- సాగునీరు అందక ఆయకట్టులో ఎండిపోయిన పైర్లు పరిశీలన
- పంట పొలాలను పశువులతో మేపిస్తుండడంపై ఆవేదన
- కరువు పీడిత రైతన్నలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వినతి

**ప్రజాశక్తి- చింతపల్లి :** వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ, తాజంగి రిజర్వాయరు ఆధునీకీకరణ, నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఆయకట్టులోని వరిపైర్లు ఎండిపోయాయని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ ఆక్షేపించారు. గురువారం మండలంలోని తాజంగి రిజర్వాయర్ కింద పంటలను నష్టపోయిన వంతమామిడి చివరి ఆయకట్టు పొలాలను పరిశీలించారు. కరువు బాధిత రైతులను పరామర్శించారు. సాగునీరు అందక ఎండిపోయిన వరిపైర్లను పశువులతో మేపిస్తున్న హృదయవిదారక దృశ్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ తాజంగి రిజర్వాయర్‌కు దాదాపు 15ఏళ్లుగా ఎటువంటి నిర్వహణ, ఆధునీకీకరణ పనులు చేపట్టకపోవడంతో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందని దయనీయ పరిస్థితి ఉందన్నారు. కొన్నేళ్లుగా ఆయకట్టు భూములకు చుక్కసాగునీరు అందని పరిస్థితి ఉన్నా అధికారులు, నేతలు పట్టించుకోకపోవడం వల్లే నేడు పశుగ్రాసానికి కూడాపనికిరానంతగా పైర్లు ఎండిపోయాయని, చివరకు సాగుచేసిన రైతులే వాటిని పశువులతో మేపించాల్సిన దుర్భిక్ష పరిస్థితులను కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతోపాటు ఆయకట్టు భూములకు సాగునీరు అందించలేని స్థితిలో రిజర్వాయర్లు, ఇతర నీటి వనరులు ఉండడం వల్లే గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల వరినాట్లు వేయని పరిస్థితులు ఉంటే, వేసిన నాట్లు సాగునీరు అందక ఎండిపోయాయన్నారు



ఎండిపోయి, పశువులతో మేపిస్తున్న పైర్లను పరిశీలిస్తున్న చిన్నయ్యపడాల్

కరువు బాధిత గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రూ. లక్ష లోపు పంటరుణాలను రద్దు చేయడంతోపాటు పెట్టుబడి సాయం అందించాలని, పంట నష్టం జరిగిన గిరిజన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం, ఏడాది పొడుగునా ఉచిత రేషన్‌బియ్యం, డిఆర్ డిపోల ద్వారా 16రకాల నిత్యావసరాల సరుకులను ఉచితంగా అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి, కరువు పీడిత రైతులను ఆదుకోకుంటే జిల్లా కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనకు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు కూడా లక్ష్మణరావు. ముట్టడం చిన్న బోనంగి బాలయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన

**పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

**ప్రజాశక్తి -పాడేరు :** గ్రామ సచివాలయ వ్యవస్థతోనే ఎపిలో పారదర్శక పాలన సాగుతోందనిపాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం సుండ్రుపుట్టు గ్రామంలో పాడేరు-3, చింతల వీధిలో గ్రామ సచివాలయాలను, అలాగే వంతాడపల్లిలో రైతుభరోసా కేంద్రం భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమాన్ని అందజేస్తూ, రూపాయి అవినీతి లేకుండా రాష్ట్రంలో పారదర్శకమైన పాలనను సిఎం జగన్ అందిస్తున్నారన్నారు. పేదల కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపిన సిఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సొన్నారి రత్నకుమారి, సర్పంచులు వంతల సీతమ్మ, కొట్టగుల్లి ఉషారాణి, మాదేల రమణమ్మ, గొల్లోరి నీలకంఠం, చింతలవీది వైస్ సర్పంచ్ తామర్ల సురేష్, ఎంపిటిసిలు గిడ్డి విజయకుమారి, చల్లా చిట్టెమ్మ, దూసూరు సన్యాసిరావు, లకే రామకృష్ణ పాత్రుడు, పాస్టర్ బాబురావు, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, మార్కెట్ చైర్మన్ కుతంగి సూరిబాబు, ఎఎంసి డైరెక్టర్ గబ్బాడి రాజారావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర, సచివాలయ కన్వీనర్లు వంతల నరేష్, లకే సత్యవతి, కొట్టగుల్లి నాగేంద్ర, సోషల్ మీడియా కన్వీనర్ అల్లాడ నగేష్, వైసిపి నేతలు ప్రసాద్, రాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణానికి స్క్రీనింగ్ కమిటీ ద్వారా ప్రతిపాదనలు

**ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే**

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి స్క్రీనింగ్ కమిటీ ద్వారా తీర్మానాలు చేసి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన సమర్పించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. మారుమూల గ్రామాలకు ఫారెస్ట్ క్లియరెన్స్‌తో రోడ్ల నిర్మాణంపై గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో స్క్రీనింగ్ కమిటీ కన్వీనర్, డివిజనల్ ఫారెస్టు అధికారి జిజి.నరేంద్రన్‌తో కలిసి ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వై.రామవరం మండలంలోని బొడ్డగుంట నుండి కన్నీరు వాగు, వలస జంక్షన్ నుండి సిరిమెట్ల, తుమ్మిచేలు నుండి కిన్నెర్ల, పిడతరిగొంది నుండి పాలగడ్డ, అడ్డతీగల మండలంలోని ఎల్లవరం నుండి మట్లపాడు, మట్లపాడు నుండి బడదాం, ఉయ్యాల మడుగు, ఉయ్యాల మడుగు నుండి గొరగుమ్మి, మట్లపాడు నుండి జె.చింతలపాలెం, జె.చింతలపాలెం నుండి బడదాం, ఉయ్యాల మడుగు నుండి గొరుగుమ్మి, జడేర్ జంక్షన్ నుండి పనుకురాతిపాలెం, దుచ్చర్తి నుండి డి.పోలవరం, గంగవరం మండలంలోని జడేరు జంక్షన్ నుండి పనుకు రాతిపాలెం, రంపచోడవరం మండలంలోని పీరుకొండ నుండి తిరగటి రాళ్ళ, దెబ్బవలస నుండి వట్టి చిలకలు, దెబ్బవలస నుండి రాతిమామిడి, మారేడుమిల్లి మండలంలోని మద్దివీడు నుండి వేటుకూరు, ఐ.భీమవరం నుండి అర్జున్ లోవ, దొరవారివీడి నుండి మెత్తలగుమ్మి, వేటుకూరు నుండి దేవుడు లంక, మర్రివాడ నుండి బుగ్గిలోవ, రాజవొమ్మగి మండలంలోని రాజవొమ్మంగి నుండి బూరుగుపల్లి, దోనెలపాలెం నుండి గొబ్బిలంఅడుగు, రంపచోడవరం మండలంలోని పీరుకొండ నుండి తిరగతి రాళ్ళ గ్రామాల వరకు మొత్తం 25 మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయడానికి ఫారెస్ట్ క్లియరెన్స్ కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ 25 రోడ్ల మధ్యలో ఎక్కడెక్కడ వంతెన్లు, కల్వర్టులు అవసరమో పిఒ ఆరా తీశారు. ఈ రోడ్లకు రెవెన్యూ మ్యాప్ ఆధారంగా ప్రతిపాదన సమర్పించాలని ఆదేశించారు. ఒక్కొక్క రోడ్డుకు ఎన్ని కిలోమీటర్లు ఫారెస్ట్ భూమి కావలసి ఉందో, రోడ్ల పక్కన డ్రైనేజీకి ఎంత భూమి అవసరమో పూర్తిస్థాయిలో నివేదికలు సమర్పించాలని కోరారు. రంపచోడవరం డివిజనల్ ఫారెస్ట్ అధికారి మారుమూల గ్రామాలకు ఫారెస్ట్ క్లియరెన్స్‌తో రోడ్ల నిర్మాణానికి జిజి.నరేంద్రన్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఫారెస్ట్ రేంజ్ అధికారులను సంప్రదించిన తర్వాతే రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ 25 రోడ్లు మధ్యలో ఎన్ని కిలోమీటర్లలో ఎన్ని హెక్టార్లలో ఫారెస్ట్ భూమిలో రోడ్లు ఏర్పాటు చేస్తున్నది, ఎన్ని చెట్లు పోతున్నాయో జాయింట్ సర్వే నిర్వహించి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడ్డతీగల సబ్ డిఎఫ్ఓ బి.శ్రీరామారావు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్‌రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, నాగరాజు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఎం.కరుణాకర్, వి.దుర్గ కుమార్, ఎం.అబ్బాయి దొర, ఎస్ఎ.ఆజాద్, ఎస్.సహేంసా, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.సావిత్రి, ఏఈలు సత్యనారాయణ, భాను. వీరభద్రరావు, యస్ఓటి. మార్తమ్మ. తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

# టిడిపి, జనసేన సమిష్టిగా పోరు

**ప్రజాశక్తి-రంపచోడవరం :** టిడిపి, జనసేన సమిష్టిగా పని చేసి 2024 ఎన్నికల్లో విజయం సాధించాలని టిడిపి రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకులు ఎర్ర వేణుగోపాల రాయుడు అన్నారు. రంపచోడవరంలో గురువారం ఏర్పాటు చేసిన టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశంలో రాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో నియంతను గద్దె దించే ప్రయత్నంలో టిడిపి, జనసేన కలిసి పోరాడుతున్నట్లు చెప్పారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కోల్పోయారన్నారు. టిడిపి. జనసేన పార్టీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు కుర్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు సోదరభావంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి రంపచోడవరం నియోజకవర్గ ఇన్చార్జ్ వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్, 11 మండలాలకు చెందిన టిడిపి, జనసేన పార్టీల మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత వేణుగోపాల రాయుడు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి బాలాజీబాబు

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మారేడుమిల్లి జెడ్పిటిసి గొర్లె బాలాజీబాబు అన్నారు. మండల కేంద్రం మారేడుమిల్లి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన పాఠశాల క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా బాలాజీబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విద్యతో పాటు క్రీడలను చక్కగా నేర్చుకోవాలని సూచించారు. మారేడుమిల్లి గ్రంథాలయాధికారి ఎమ్ రమేష్ ఆధ్వర్యంలో జరుగు వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రతి ఒక్కరు రాణించాలన్నారు. అలాగే క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, గెలుపునకు ప్రతి ఒక్కరు పోటీపడాలని పిలుపునిచ్చారు. మారేడుమిల్లి పంచాయితీ సర్పంచ్ కొండా జాకబ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి విద్య, క్రీడలపై దృష్టిసారించాలని, ఈ పోటీల్లో కెజిబివి బాలికోన్నత, ఏకలవ్య మోడల్ పాఠశాల, గురుకుల సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, ఆశ్రమ బాలుర పాఠశాల, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ బాలుర పాఠశాల, గురుకుల పాఠశాల విద్యార్థులకు మధ్య జరిగిన వాలీబాల్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



మోహన్‌ను సన్మానించి స్వీట్ తినిపిస్తున్న సిపిఎం నాయకులు

## పిహెచ్‌డి పొందిన మోహన్‌కు సిపిఎం సన్మానం

**ప్రజాశక్తి- కూనవరం**

మండలంలోని గొమ్ముఅయ్యవారిగూడెం గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు కర్నాటి శ్రీనివాసరావు కుమారుడు కర్నాటి మోహన్ ఆమిటీ యూనివర్సిటీ నుండి సిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ విభాగంలో పిహెచ్‌డి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా సిపిఎం మండల నాయకులు గురువారం మోహన్ ఇంటికి వెళ్లి ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ తను ఆమిటీ యూనివర్సిటీలో జాయిన్ అయిన రెండు నెలలకే డాక్టరేట్ ఇచ్చినట్లు చెప్పారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిసైన్ మేన్‌ఫ్యాక్చరింగ్ టెక్నాలజీ వారు డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను ఢిల్లీలోని ఆమిటీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నానని వెల్లడించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యంత ప్రతిభ కనబరిచి చిన్న వయసులోనే డాక్టరేట్ రావడం అభినందనీయమన్నారు. ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సర్పంచ్ నాగమణి, తాళ్లూరి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, కొండా ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు 4 మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-రంపచోడవరం**

జాతీయ రహదారి 516ఇ విస్తరణ పనుల్లో భాగంగా గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై రామవరం మండలాల పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎమ్‌డి యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఇది గమనించి సహకరించాలని కోరారు.

## గ్రామాల్లో 'ఎపికి జగన్ ఎందుకు కావాలి'

**ప్రజాశక్తి-కొయ్యూరు**

మండలంలోని చిట్టింపాడు, గదబపాలెం, సచివాలయం పరిధిలో గురువారం ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, ఎంపిటిసి బిరిజన అప్పారావు, సర్పంచ్ నేమాని నూకాలమ్మ, జెసిఎస్ కన్వీనర్ సుధాకర్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల లిస్ట్‌తో ఉన్న బోర్డును ఏర్పాటు చేశారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జోగుంపేట నుండి చిట్టింపాడు రోడ్డు నిర్మాణం, రూ.6కోట్లతో సంక్షేమం కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉల్లి నరసమ్మ, నీలపు సూరిబాబు, రీమల గంగాధర్, పోతురాజు, ఉల్లి రామ్మూర్తి, పెట్ల గాంధీ, గ్రామ వాలంటీర్లు, గృహసారధులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**అంతాడ పంచాయతీలో..**

కొయ్యూరు మండలం అంతాడ గ్రామ సచివాలయం, బంగారంపేట పరిధి కొత్తపెల్లి గ్రామంలో వాలంటరీ అల్లంపల్లి కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అమలులో గత ప్రభుత్వానికి, ఇప్పటి వైసిపి ప్రభుత్వానికి తేడాలు తెలియజేశారు. కార్యక్రమంలో గృహసారథులు సరమండ లక్ష్మి, సుండ్రు కృష్ణబాబు, సుంకరి రామస్వామి, అంతాడ గ్రామ సచివాలయం కన్వీనర్ రీమల గంగాధర్, సరమండ అగ్గి రాముడు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసిలు

## రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-జి.మాడుగుల:** మండలంలోని పెద్దలువ్వాసింగి పంచాయతీ అలగం బిటిరోడ్డును అలాగే చిలకలపాలెం నుండి శంకులమెట్ట, బూసిపల్లి గ్రామాల వరకు సుమారు 4.50 కిలోమీటర్ల పాడేరు జెసిబి రోడ్డు నిర్మాణ పనులకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశాలతో గురువారం స్థానిక సర్పంచ్, ఎంపిటిసిల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి గబ్బాడి సత్యం దొర,వైసిపి సీనియర్ నేత కె సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ జి పండుదొర, వార్డు సభ్యుడు కె వెంకటేశ్వర్లు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు ఎస్ రామకృష్ణ, జి.మాడుగుల సర్పంచ్ కె రాంబాబు, జెసిఎస్ మండల ఇంచార్జి ఎల్ కళ్యాణ్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ నాగూర్‌బాబు, పి ఆంధ్రయ్య సోలభం ఎంపిటిసి కె చిన్నారావు, నేతలు ఎ.బాబురావు, వి.సూర్యప్రకాష్ నాయుడు, కె ప్రసాద్, వాలంటీర్ల బి మత్స్యకొండబాబు, రాంబాబు పాల్గొన్నారు



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

## గుంటగన్నెలలో పశు వైద్య శిబిరం

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** మండలంలోని గుంటగన్నెల పంచాయతీలో స్థానిక పశు వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మేకలు, 231 గొర్రెలు, 412 పశువులకు పశువైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ వైద్యసేవలు అందించారు. జీవాలకు టీకాలు, డివార్మింగ్ మందులను వేశారు. అనంతరం డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ సీజన్‌లో పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా గిరిజనులకు పలు సలహా సూచనలు చేస్తూ, అవగాహన కల్పించారు. మూగజీవులకు ఎటువంటి వ్యాధులు సోకినా, వెంటనే స్థానిక పశు వైద్యశాలను సంప్రదిస్తే వెంటనే వైద్య సేవలు అందిస్తామన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని గిరి రైతులు వీటిని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఓ. ఎస్ సుబ్బారావు, సంజీవరావు, ఎస్ త్రినాధరావు, ఎస్ జయరాజు, ఏ జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

### తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఓటర్ల జాబితా నుంచి తన పేరును, తన తల్లిదండ్రుల పేర్లను గల్లంతు చేశారని, వాటిని జాబితాలో తక్షణం పునరుద్ధరించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం రామ్ మీడియాతో మాట్లాడుతూ తమ ఓట్ల తొలగింపునకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధి వెంకోజీపాలెంలో 12 సంవత్సరాల నుంచి తాము నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో పోలింగ్ బూత్ నెంబర్ 273లో ఓటు వేసామన్నారు. తమ నియోజకవర్గంలో తమ కుటుంబంతో పాటు సుమారు 40 వేల మంది ఓట్లు గల్లంతయ్యాయన్నారు.

# 'నా భర్తను కొట్టి చంపేశారు'

**పోలీసులకు ప్రభుత్వ ఉద్యోగి భార్య ఫిర్యాదు**

**బైక్‌తో గుద్దాడన్న కారణంతో దాడి చేశారని ఆరోపణ**

**ప్రజాశక్తి- ముంచింగిపుట్టు :** బైక్‌తో ఢీకొట్టాడన్న కారణంతో తన భర్త, ప్రభుత్వ ఉద్యోగి కుర్రాడి శ్రీనివాసరావు(48)ను వనభసింగికి చెందిన బాధితుడు బలరాం కుటుంబసభ్యులు, స్థానికులు దాడి చేసి కొట్టి చంపేశారని మృతుడి భార్య రోహిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివి. ముంచంగిపుట్టు మండలం పెదగూడ పంచాయతీ సారది గ్రామానికి చెందిన కుర్రాడి శ్రీనివాసరావు పెదబయలు మండలం సీతగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర-1 పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. స్వగ్రామం ముంచంగిపుట్టు మండలం నుంచి రోజూ పెదబయలు పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహణ అనంతరం సాయంత్రానికి ఇంటికి చేరుకుంటుంటాడు. ఈనెల 15వ తేదిన బుధవారం ఉదయం ఆర్‌టిసి బస్సులో విధులకు వెళ్లిన శ్రీనివాసరావు, సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో ఎపి39ఇఎం1159 నెంబర్ గల గ్లామర్ బైక్ తో వస్తుండగా, సాయంత్రం 5 గంటల సమయంలో వనభసింగి గ్రామ సమీపంలో డిఆర్ డిపో రోడ్డు మలుపు వద్ద, ఆకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన స్థానికుడు పూజారి బలరాంను ప్రమాదవశాత్తు బైక్‌తో గుద్దేశాడన్నారు. దీంతో తలకు గాయమైన బలరాం పెద్దగా కేకలు వేయడంతో అతని కుటుంబీకులతోపాటు స్థానికులు మూకుమ్మడిగా వచ్చి తన భర్త శ్రీనివాసరావుపై భౌతికదాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ దాడిలో శ్రీనివాసరావు ఎడమకంటికి, తలపైనా తీవ్రగాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావమై మృత్యువాత పడ్డాడని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో మృతుని భార్య రోహిణి పేర్కొంది. ఈ ప్రమాదంలో తన భర్త మరణించారేదని, బలరాం కుటుంబసభ్యులు, స్థానికులు తీవ్రంగా కొట్టి చంపారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తన భర్త మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొంది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు.

# రాష్ట్ర శ్రేయస్సే టిడిపి, జనసేన కూటమి లక్ష్యం

**మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు**

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :** రాష్ట్ర శ్రేయస్సు కోసమే టిడిపి, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం సాయంత్రం అయ్యన్న నివాసంలో వద్ద నర్సీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తాను ఎప్పటి నుంచో ఈ రెండు పార్టీలు కలిసిపని చేయాలని కోరుకున్నానన్నారు. అధికారం, పదవులు శాశ్వతం కాదని, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు ముఖ్యమన్నారు. ఈ రెండు పార్టీల అధినేతలైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నామన్నారు. సైకో పాలనకు తరలికొట్టేందుకు టిడిపి, జనసేన నాయకులు ఉమ్మడిగా పని చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ టిడిపి, జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఇరుపార్టీల నాయకులు సమన్వయంగా పని చేయాలన్నారు. టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన కలయికతో వైసిపి భూస్థాపితం కావడం ఖాయమన్నారు కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు : ధర్మశ్రీ

**ప్రజాశక్తి - రావికమతం** :ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి గురువారం అపూర్వ ఆదరణ లభించింది. వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను ఒక్కొక్కరినీ తన చాంబర్‌కు పిలిచి, సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడే ఉన్న సంబంధిత అధికారుల ద్వారావాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, సమస్యల పరిష్కార వేదికకు మంచి స్పందన వచ్చినందున ఇక నుంచి ప్రతి మంగళవారం రోలుగుంట, బుధవారం బుచ్చయ్యపేట, గురువారం చోడవరం, శుక్రవారం రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తాను అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు..పల్లె నిద్ర కార్యక్రమం వలన మధ్యాహ్నం రెండు గంటల వరకే అందుబాటులో ఉంటానన్నారు. నియోజవర్గ ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి పైలా రాజు ముక్కా మహాలక్ష్మి నాయుడు, గుమ్ముడి సత్యదేవ్, కంచిపాటి జగన్నాధరావు పాల్గొన్నారు.

# చెట్టుపల్లి, బైలపూడిలో పశువిజ్ఞానబడి

**ప్రజాశక్తి- చీడికాడ** : మండలంలోని బైలపూడి, చెట్టుపల్లి గ్రామాలలో చీడికాడ, పెదగోగాడ పశు వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి దేవి, డాక్టర్ కెవిఎస్ రాఘవమ్మ అధ్వరంలో గురువారం పశు విజ్ఞాన బడి, పశు వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 60 మంది పాడి రైతులకు చెందిన 28 గర్భకోశ వ్యాధులకు, 40 పశువులకు సాదారణ చికిత్స చేశారు 35 మంది పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. మాడుగుల పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వి. చిట్టినాయుడు, చెట్టుపల్లి సర్పంచ్ గొర్లి గణేష్, పశు వైద్య సహాయకులు సాయి, గంగునాయుడు, 1962 సిబ్బంది, లాబ్ టెక్నీషియన్ కుమారి పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## ఉరేసుకుని యువకుడు మృతి

**-ప్రేమించి, పెళ్లిచేసుకున్న యువతిని**

**ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లారని మనస్తాపం**

**ప్రజాశక్తి - దుంబ్రిగుడ:** ప్రేమించి గాంధర్వ వివాహం చేసుకున్న యువతిని ఆమె తల్లిదండ్రులు తీసుకెళ్లారని మనస్థాపంతో యువకుడు చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబీకుల నుంచి సేకరించిన వివరాలివి.

మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీ బూసిపుట్టు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కొర్ర శ్రీను(18), అరకు వేలి మండలం పద్మాపురం పంచాయతీ పింపలగూడ గ్రామానికి చెందిన జ్యోతి ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు ఇష్టపడడంతో తల్లిదండ్రులకు తెలియకుండా ఆదివారం గాంధర్వ వివాహం చేసుకొని మృతుడి స్వగ్రామానికి వెళ్లారు. విషయాన్ని తెలుసుకున్న యువతి కుటుంబకులు సోమవారం ఉదయం మృతుడి స్వగ్రామానికి చేరుకొని కుటుంబీకులతో తగాదా పడి, భయభ్రాంతులకు గురిచేసి యువతిని తీసుకెళ్లిపోయారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన యువకుడు బుధవారం రాత్రి గ్రామానికి సమీపంలోని పనస చెట్టుకు ఉరేసు వేసుకున్నారని బాధిత కుటుంబ సభ్యులు బోరుమన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

స్థానిక సర్పంచ్ రామ్మూర్తి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంతోష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జెండాను ఆవిష్కరించిన ఎంపిపి వరహాలమ్మ

## ఘనంగా సహకార సంఘాల వారోత్సవం

**ప్రజాశక్తి-పెదబయలు:** స్థానిక ప్రాథమిక సహకార సంఘ భవనంలో 70వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి రాంబాబు ఆధ్వర్యంలో సంఘం జెండాను స్థానిక ఎంపిపి బోండా వరహాలమ్మ ఆవిష్కరించారు. ఈనెల 14 నుండి 20 వరకు జరిగే సహకార సంఘాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జి.వెంకయ్య, వైస్ ఎంపిపి కె రాజబాబు, డైరెక్టర్ సుబ్బారావు, మాజీ జెడ్‌పిటిసి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ వి.సన్యాసిరావు, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు

## జెడ్‌పి సిఇఒకు అభినందన

**ప్రజాశక్తి-మాడుగుల:** ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయడును కాపు సంఘం డైరెక్టర్, ఎం కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు గొల్లవిల్లి సంజీవరావు. గురువారం మర్యాదపూర్వకంగా కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సిఇఒ పోలినాయుడు మరెన్నో ఉన్నత పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. ు కాంట్రాక్టర్ ఎస్‌కె భాష,రాఖీ శ్రీను ఉన్నారు.



గ్యాన్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు

## ఉచిత గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి - సీలేరు :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గ్రామ సచివాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ బిబి.సుభాని తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉచిత గ్యాస్ కనెక్షన్ కొరకు జీకే వీధి మండలం సీలేరు జిసిసి డిపో వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కావాల్సిన వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా దరఖాస్తుకు జత చేయాలని కోరారు. ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ బండ, పొయ్య ఉచితంగా పొందవచ్చునని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసం ఇప్పటివరకు 85 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

## జెడ్‌పి వైస్ ఛైర్మన్‌గా గిరిబాబు



**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌గా సుంకర గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఈ పదవికి ఎన్నిక జరగ్గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రకటించారు. జిల్లా పరిషత్‌కు ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండగా వారిలో ఒకరైన దాసరి అప్పారావు (సబ్బవరం జెడ్‌పిటిసి) ఇటీవల మరణించడంతో ఏర్పడిన ఖాళీలో ఈ ఎన్నిక నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ క్రమంలో ఎన్నిక కోసం గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హాల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వైసిపికి చెందిన 25 మంది జెడ్‌పిటిసి సభ్యులు హాజరయ్యారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్, ముంచింగిపుట్టు జెడ్‌పిటిసి సభ్యురాలు జె.సుభద్ర జెడ్‌పి వైస్ ఛైర్మన్ పదవికి పద్మనాభం జెడ్‌పిటిసి సభ్యుడు సుంకర గిరిబాబు పేరును ప్రతిపాదించగా పరవాడ జెడ్‌పిటిసి సభ్యుడు పైలా సన్యాసిరాజు బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి మల్లికార్జున ప్రకటించారు.

**పలువురు అభినందనలు**

గిరిబాబుకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పలువురు జెడ్‌పిటిసిలు, నాయకులు అభినందనలు తెలిపారు.


## సముద్ర నీటి కాలుష్య నియంత్రణకు చర్యలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ :** సముద్రంలోకి ప్రవహించే వ్యర్థాలు, మురుగునీటితో సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండేందుకు తగు నివారణ చర్యలను వేగవంతం చేయాలని, వీటిపై వీలైనంత త్వరగా నివేదిక తమకు అందజేయాలని జిల్లా కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. విశాఖపట్నం ఏరియాలో సముద్రంలోకి ప్రవహించే వ్యర్థాలు, మురుగునీటితో సముద్రపు నీరు కలుషితమైందని డాక్టర్ రాజేంద్రసింగ్, బొలిశెట్టి సత్యనారాయణ 2020లో హైకోర్టులో కేసు వేసిన సంగతి విదితమే. ఈ విషయమై హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబరులో సముద్ర జలాలు కలుషితం కాకుండా ఉండేందుకుగల నివారణ చర్యలపై కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎస్‌టిపిలు, ఇటిపిలను నిర్మించడం ద్వారా లేదా ఇప్పటికే ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్ సభ్యులకు పలు సూచనలు చేశారు.

# బల్క్‌డ్రగ్ పనులకు ఎపిఐఐసి కసరత్తు

**నిధుల్లేక పిపిపి వైపు మొగ్గు - త్వరలో ఈ - టెండర్లు ఆహ్వానం**

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**



జిల్లాలోని నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో పరిశ్రమల రాకకు ప్రాథమిక అవసరమైన కామన్ ఎఫ్లూయింట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సిఇటిపి) పనులకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఎపిఐఐసి) టెండర్లు పిలవనుంది. ఎపిఐఐసి వద్ద నిధుల్లేకపోవడంతో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో సిఇటిపి, వాటర్ ట్రీట్‌మెంట్, ఇతర పనులు చేపట్టాలని భావిస్తోంది. దాదాపు రూ.500 కోట్లు విలువైన ఈ పనులకు అనుభవం కలిగిన ప్రయివేటు సంస్థలను ఈ - టెండర్ల ద్వారా ఆహ్వానించనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి కొన్ని అనుమతులు రాబెట్టుకొని టెండర్ల ప్రక్రియకు వెళ్లడానికి సిద్ధపడుతోంది. కాకినాడ సెజ్ నుంచి బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లికి తరలిస్తూ సెప్టెంబర్ 20న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సివుంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి వారం రోజుల్లో పంపించనున్నారు. ఈ అనుమతులతో పాటు పర్యావరణ అనుమతులను కూడా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సివుంది. అవి వచ్చాక ఈ టెండర్లకు వెళ్లాలని యోచిస్తున్నారు.

టెండర్లు దక్కించుకున్న సంస్థ కేవలం పరిశ్రమల నుంచి నిర్వహణ ఖర్చులు తీసుకొనేలా ఎపిఐఐసి ఒప్పందం చేసుకోనుంది. గతంలో వలె ప్రయివేటు డెవలపర్‌కు ప్రభుత్వ ఆస్తులపై హక్కు దఖలుపర్చకుండా కేవలం పరిశ్రమలకు కల్పించిన సదుపాయాలకు రుసుము వసూలు చేసుకొనేందుకు ప్రయివేటు సంస్థను పరిమితం చేయనుంది. నూతన నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్తులపై పూర్తి హక్కు ప్రభుత్వానికి వుండనుంది. రెండు వేల ఎకరాల్లో ఏర్పాటుకానున్న బల్క్ డ్రగ్ పార్కులో పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. కాలుష్య ప్రభావం పెద్దగా లేకుండా వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసే సిఇటిపిని ఆధునిక టెక్నాలజీతో నిర్మించనున్నట్లు ఎపిఐఐసి అధికారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

# 'ఉక్కు'పై నాటకాలొద్దు

**బిజెపి ఎంపీ జివిఎల్ కపట ప్రకటనలు ఆపి కేంద్రంతో ప్రకటన చేయించాలి**

**సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు డిమాండ్**

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు కపట ప్రకటనలు ఆపి, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మే ప్రక్రియను నిలిపివేసినట్టు, భవిష్యత్తులో కూడా ప్రైవేటీకరణ జరగకుండా కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తున్నట్టు, స్ట్రాటజిక్ సేల్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌కు వెళ్లదని పేర్కొంటూ తరచూ జివిఎల్ ప్రకటనలు చేస్తున్నారన్నారని తెలిపారు. ఆయన ప్రకటనలు వాస్తవమైతే, చిత్తశుద్ధి ఉంటే ఆ విషయాలను కేంద్ర మంత్రివర్గం ద్వారా ప్రకటన చేయించాలన్నారు. అప్పుడే కార్మికులు, ప్రజలు నమ్ముతారన్నారు. ప్లాంట్‌ను లాభాల బాట పట్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన ప్రకటించారని, అదే వాస్తవమైతే ప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో ఎందుకు నడిపించడం లేదని, ఉత్పత్తిని నిలిపివేసిన బ్లాస్ట్ ఫర్నేసులను తిరిగి ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఎందుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం లేదని, ఎందుకు ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయడంలేదని జగ్గునాయుడు సూటి ప్రశ్న వేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేది లేదని స్వయానా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆ రాష్ట్రం వెళ్లి మరీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర బిజెపి పాలకులకు ఎందుకు ఆ విధంగా నోరు రావడం లేదన్నారు. ఎందుకు జిందాల్ సంస్థను విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జొప్పించే కుట్రలు చేస్తున్నారని నిలదీశారు. మోసపూరిత ప్రకటనలను కార్మికులు, ప్రజలు నమ్మరన్న విషయాన్ని జివిఎల్ గుర్తెరగాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా, ప్రజా ఉద్యమంగా మలిచే దిశగా సిపిఎం కృషి చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికలలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ రాజకీయ అజెండాగా మారనుందని తెలిపారు. ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్రలు చేసేవారు, వారికి మద్దతునిచ్చేవారు, కపట ప్రకటనలు చేసే వారు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

**సిఐటియు ఖండన**

జివిఎల్ కపట ప్రకటనలను సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.

# ఘనంగా కళంజియ దినోత్సవం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** సాగరతీర కళంజియ సమాఖ్య 26వ కళంజియ ఉద్యమ దినోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలు ఈ నెల 30 వరకూ జరుగనున్నాయి. గురువారం చిన వాల్తేర్ రజికవీధి, తమిళ్ స్ట్రీట్ క్లస్టర్లలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సాగరతీర కళంజియ సమాఖ్య కోస్టల్ రీజనల్ కో - ఆర్డినేటర్ ధనలక్ష్మి మాట్లాడారు. కళింజియ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అతిథులుగా వార్డు కార్పొరేట్ ముచ్చల లక్ష్మీ సురేష్, 20వ వార్డు సిఇ రత్నం, 21వ వార్డు సిఇ ఇందిర పాల్గొన్నారు.

## ఆహ్లాదభరితం పాపికొండలు ప్రయాణం

**ప్రజాశక్తి-విఆర్.పురం :** పాపికొండల ప్రయాణం ఎంతో ఆహ్లాదభరితంగా ఉంటుంది. అదో కమనీయ దృశ్యం. ఎన్నిసార్లు ఎన్నిసార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనే కోరిక ఎవరికైనా కలుగక మానదు. ఎత్తైన కొండలు, ఒంపు సొంపులు గోదారమ్మ పరవళ్ళు, జాలు వారే పేరంటాలపల్లి జలపాతం సోయగాలు నడుమ పడవ ప్రయాణం మధురానుభూతిని ఇస్తుంది. పురాతన ప్రసిద్ధ గాంచిన రామకృష్ణ ముని వాటం, నది ఒడ్డునే శివాలయం, అక్కడే పర్యాటకుల మదిని ఆకర్షించే పాపికొండలు సాక్షాత్కరిస్తాయి. పచ్చని అడవి పరికిణీ పరిచేలా ఆహ్లాద పరుస్తోంది. పక్షుల కిలకిల రాగాలు నెమ్మదిగా ప్రవహించే గోదావరి ఒంపు సొంపులు నదిపొడవునా కొండరెడ్ల గ్రామాలు ఇంత అందమైన పాపికొండలను పర్యాటక ప్రేమికులు ఒక్కసారైనా చూడాలని కోరుకుంటారు. ఈ సీజన్‌లో అత్యధికంగా పర్యాటకులు పాపికొండలు ప్రయాణం చేస్తున్నారు.




గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు

## గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

**ప్రజాశక్తి-విఆర్.పురం :** కూనవరం మండలం, కూనవరం శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు ముఖ్య అతిథులు విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటస్వామి, చేరుకూరు సుబ్బారావు, మజ్జి సత్యనారాయణ, విజయ సాధన ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. గ్రంథాలయ ఉద్యమంలో వారు చేసిన కృషిని కొనియాడారు. అందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మాదేటి గోవిందరాజులు, సిబ్బంది నాగరాజు, పాఠకులు నోముల సాయి మహేష్, హైస్కూల్ విద్యార్థులు, విజయ సాధన విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరిగిన చలి తీవ్రత

**ప్రజాశక్తి - సీలేరు :** ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి మంచు కురుస్తుండడంతో స్వల్పంగా శీతల గాలులు వీస్తూ చలి మెల్ల మెల్లగా పెరుగుతూ రాత్రి 9 తర్వాత చలి అధికమవుతుంది. ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి మంచు అధికంగా కురుస్తూ తెరచాపలా కమ్మేస్తుంది. దీంతో ఉదయం వ్యాయామం చేసేవారికి ఇబ్బందికరంగా మారింది. డిసెంబర్ నెలలో మరింత చలి తీవ్రత అధికంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సీలేరు నది పరివాహక ప్రాంతంలో చింతపల్లి క్యాంపు లైకెన్‌పూర్, చంద్రపల్లి గ్రామ గిరిజనులు ఇప్పటికే చలిమంటలు వేసుకుంటూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మంచు చలి కారణంగా వద్ధులు మరియు ఆస్మాతో బాధపడుతున్న వ్యక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా - అమరావతి సర్కిల్ వెల్ఫేర్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ సర్కిల్ వాలీబాల్ పోటీలు గురువారం ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 16 సర్కిళ్ల పరిధిలో 16 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. తొలి రోజు స్థానిక ఎల్‌డిఎం, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో దేశంలో ఉన్న 16 సర్కిళ్ల స్టేట్ బ్యాంకు ఉద్యోగుల నుంచి ఎంపిక చేసిన మేటి ఆటగాళ్ళందరూ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.